క్లుప్తంగా

బంగారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న బంగారమ్మ తల్లి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల శ్రీ బంగారమ్మ తల్లి ఆలయంలో మార్గశిర మాసం తొలి గురువారం అమ్మవారిని సర్వ భూషణ అలంకరణ చేశారు. పువ్వులు, తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మ వారికి పసుపు, కుంకుమ సమర్పించారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు



కుంతీ మాధవ స్వామి ఆలయంలోని గోదాదేవి విగ్రహం

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభంకానున్నాయి. జనవరి 14న గోదారంగనాథుల కల్యాణంతో ముగుస్తాయి. 16న రాత్రి 12.34 గంటలకు నెల గంట కొట్టి ధనుర్మాసోత్సవాలు ప్రారంభిస్తారు. ఈ నెల రోజులు నగర సంకీర్తన నిర్వహిస్తారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అన్నవరం ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఆశిపాలెం, నమ్మివానిపాలెం, కొనసవానిపాలెం, కంచేరుపాలెం, పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం, జీరుపాలెం, పాతపాలెం, పైల పేట, కొత్త గొల్లపేట, ఎర్రయ్యపాలెం, కొత్తపేట, అన్నవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

పీఎం పాలెం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ హెచ్‌పీసీఎల్ ఫీడర్ ఏరియాలో లైన్ల నిర్వహణ పనులు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. హెచ్‌పీసీఎల్ ఏరియా, సాండ్ అండ్ సాండ్ లే అవుట్, దుర్గాలమ్మ మందిర పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

పాండ్రంగి వంతెన నిర్మాణానికి నేడు శ్రీకారం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి వాసుల చిరకాల స్వప్నం గోస్తనీ నదిపై పంచాయతీరాజ్ నిధులు రూ.16.50 కోట్లతో వంతెన నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టనున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు వంతెన నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో – ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

'చాగంటి' ఉపన్యాసం నేడు

తగరపువలస: విద్యార్థులు – వారి వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై శుక్రవారం ఉదయం 9.30 గంటలకు భీమిలి కేథరిన్ విద్యాసంస్థల ఆవరణలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుచే ఉపన్యాస కార్యక్రమం ఉంది. లయన్స్ క్లబ్ భీమిలి సెంటినియల్, సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్, రబోర్న్ గ్రూప్ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించనుంది.

'ఇనాం' రైతుల జీవితాల్లో వెలుగులు

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం 'ఇనాం భూముల' సాగు రైతులకు వరంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూమిపై హక్కులు లేకపోయినా బోని, శిర్లపాలెం గ్రామాల్లోని ఇనాం భూముల సాగుదారులందరికీ రైతు భరోసా సాయాన్ని అందజేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లోని ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. తరతరాలుగా స్వేదం చిందిస్తూ భూమినే నమ్ముకొని జీవిస్తున్నారు. అయితే వందలాది ఎకరాల భూమి తమ చేతిలో సాగవుతున్నా వాటిపై కనీసం సాగు హక్కులు కూడా లేని దైన్యమైన పరిస్థితి వారిది. ప్రభుత్వ రాయితీలు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందలేని దుస్థితి. మండలంలోని బోని, శిర్లపాలెం గ్రామాల్లోని రైతుల అవస్థ ఇది. ఆ రెండు గ్రామాల్లో ఉన్న భూములు ఇనాం భూములు కావడమే వారి పాలిట శాపంగా మారింది. ప్రభుత్వాలు మారినా వారి తలరాత మాత్రం మారలేదు. దీంతో ఇంత వరకు వారు సొంత భూముల్లోనే కూలీలుగా బతుకులు వెళ్లదీస్తున్నారు. టీడీపీ పాలనలో రెండు గ్రామాల్లో ఎన్నికల లబ్ధికోసం మూడు సార్లు రీ సర్వే చేసి నివేదికలు మూలన పడేశారు. దీంతో రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ పూర్తి స్థాయిలో రీ సర్వే చేసి ఇనాం భూములను సాగు చేసుకుంటున్న రైతులందరికీ పూర్తి హక్కులు కల్పించాలని ఆదేశించారు. ఈ మేరకు బోని గ్రామంలో రీ సెటిల్‌మెంట్ సర్వే పూర్తి కాగా, శిర్లపాలెంలో దాదాపు పూర్తి కావచ్చింది. దీంతో ఎప్పటి నుంచో ఉన్న సమస్య పరిష్కారమై పూర్తి హక్కులతో పట్టాలు మంజూరు కానుండడంతో రెండు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - ఆనందపురం

- తాతల కాలం నాటి కల నెరవేర్చిన జగనన్న ప్రభుత్వం
- బోని, శిర్లపాలెం గ్రామాల్లో రీ సెటిల్‌మెంట్ సర్వే పూర్తి
- సాగు రైతులందరికీ 'రైతు భరోసా' వర్తింపు
- అన్నదాతలందరికీ విత్తనాలు, ఎరువుల సరఫరా



ఇది కదా అభివృద్ధి



అన్నదాతకు రైతు భరోసా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

105 ఎకరాలు	80	రూ.28.13 లక్షలు
బోని గ్రామంలోని ఇనాం భూమి	బోని గ్రామంలో లబ్ధిపొందే రైతులు	బోని గ్రామంలో 80 మంది రైతులు ఇప్పటి వరకూ పొందిన రైతు భరోసా సాయం
177 ఎకరాలు	200	రూ.73.80 లక్షలు
శిర్లపాలెం గ్రామంలోని ఇనాం భూమి	శిర్లపాలెం గ్రామంలో లబ్ధిపొందే రైతులు	శిర్లపాలెం గ్రామంలో 207 మంది రైతులు ఇప్పటి వరకూ పొందిన రైతు భరోసా సాయం

సీఎం జగన్ దయతోనే...



మా కుటుంబం పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోంది. రెండు పంటలు పండుతున్నా ఇనాం భూములపై హక్కులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడేవారము. ఆర్థిక అవసరాలకు బ్యాంకులకు వెళ్లినా పట్టించుకోని పరిస్థితి. దీంతో పంటలు పండించుకోవడానికే తప్ప భూముల వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేకుండా పోయింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల భూములకు యాజమానులము అవుతున్నాం. – కొళ్ల యల్లమనాయుడు, రైతు, బోని



బోని గ్రామంలో సాగు చేస్తున్న ఇనాం భూములు



శిర్లపాలెంలో సర్వే చేస్తున్న రెవెన్యూ, సచివాలయ సిబ్బంది

రైతు భరోసాతో ఆర్థిక ఆసరా



సాగు చేసుకోవడం తప్ప ఎటువంటి హక్కులూ లేకపోవడంతో సీజనులో పంటలు వేసుకోవడానికి పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ఇనాం రైతులను గుర్తించి రైతు భరోసా పథకం వర్తింపజేశారు. దీంతో పెట్టుబడులకు ఇబ్బంది లేకుండా పోతోంది. సీఎం జగన్‌కు రుణపడి వుంటాం. – మద్దిల ఆదినారాయణ, బోని.

విలువైన ఆస్తిపై హక్కు



ఇంత వరకు సాగ చేసుకోవడమే తప్ప హక్కులు లేని భూములకు సంపూర్ణ యామజాన్య హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం వల్ల ఎంతో మంది పేద రైతులకు మేలు జరుగుతుంది. ఆర్థిక అవసరాలకు భూములు విక్రయించుకుందామన్నా గతంలో అవకాశం లేకుండా పోయింది. సీఎం జగన్ పట్టాలు మంజూరు చేయనుండడంతో ఎంతో మేలు జరుగుతుంది. – ఉప్పల వెంకటేశ్వరరావు, బోని రైతు

ప్రతిభను ప్రోత్సహించడానికే 'ఆడుదాం ఆంధ్ర'



విద్యార్థులతో ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించడానికే ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంతో మంది యువతలో మంచి క్రీడా నైపుణ్యాలు దాగి ఉన్నాయని, పేదరికం, ఇతర కారణాల వల్ల అవకాశాలు లేకుండా పోతున్నాయన్నారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి 'ఆడుదాం ఆంధ్ర'కు శ్రీకారం చుట్టారన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులకు అవకాశాలు లభించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేందుకు అవకాశం వుంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఎంఈవో శివరాణి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, భీమిలి, పద్మనాభం మండలాల ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది నిర్వహణలో అంగన్‌వాడీ కేంద్రాలు



ఆనందపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరుస్తున్న సచివాలయ సిబ్బంది

ఆనందపురం : అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది నిరవధిక సమ్మెకు దిగడంతో కేంద్రాలు మూతపడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆయా సచివాలయాల సిబ్బంది తాత్కాలికంగా కేంద్రాల నిర్వహణ బాధ్యతను తీసుకున్నారు. ఈ మేరకు మండలంలో గల 18 సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సిబ్బంది గురువారం తెరిచారు. సచివాలయంలోని వివిధ విభాగాల అధికారులు కేంద్రాలను పర్యవేక్షించారు. ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 12 వరకూ కేంద్రాలను నిర్వహిస్తారు. లబ్ధిదారుల ఇంటికి రేషను పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. సరకుల వివరాల పట్టికలను పరిశీలిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో సరకుల వివరాల పట్టికలు కనిపించలేనట్లు తెలుస్తోంది. అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె ఒక కొలిక్కి వచ్చే వరకూ కేంద్రాలను సచివాలయ సిబ్బంది నిర్వహించే అవకాశం ఉంది.

'జస్వంత్' సిబ్బందికి సరకులు అందజేత



జస్వంత్ రెడీమేడ్స్ సిబ్బందికి సరకులు అందిస్తున్న ఆలీవర్ ఆర్ రాయి, తదితరులు

తగరపువలస: గత నెల 26న జస్వంత్ రెడీమేడ్స్ షాపింగ్‌మాల్ అగ్ని ప్రమాదానికి గురవడంతో ఉపాధి కోల్పోయిన 29 మందికి భీమిలి కేథరిన్ విద్యాసంస్థల నుంచి రూ.50వేల విలువైన నిత్యావసర సరకులు గురువారం అందించారు. విద్యాసంస్థల ఆవరణలో వీటిని కేథరిన్ చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదుగురికి తాను ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు అన్నీ కలిసి వచ్చినా సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను గెలిపించి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెంలో గురువారం సాయంత్రం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. కేవలం 8వ వార్డులోనే రూ.15 కోట్లు అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం గత నాలుగున్నరేళ్లలో ఖర్చు చేశామని తెలిపారు. రానున్న కాలంలో రుషికొండ, సాగర్‌నగర్ మరింత అభివృద్ధి చెందుతాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇక్కడి నుంచే పరిపాలన సాగిస్తారన్నారు. పరిపాలన అనేది ప్రజల చెంతనే ఉండాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ప్రజల వద్దకే పథకాలు అందిస్తున్న గొప్ప ప్రభుత్వం వైఎస్సార్ సీపీదే అని కొనియాడారు. పింఛన్ నుంచి రేషన్ వరకు ప్రతీదీ ఇంటి ముంగిటకే అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జులు గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు, బొడ్డు శ్రీనివాస్, ఎరుపిల్లి అప్పలరాజు, చిల్లా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



జీవీఎంసీ 5వ వార్డులో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఆదర్శనగర్‌లో సంక్షేమ పథకాల జాబితా ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుంటే... కేవలం ఓట్లే లక్ష్యంగా ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెడుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్ సచివాలయ పరిధి సంతపేటలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమమే ధ్యేయంగా వివక్షకు తావు లేకుండా పని చేస్తున్న ప్రభుత్వాన్ని కుడిచేయితో పోల్చారు. రుణ మాఫీ, సున్నా వడ్డీ హామీలు అమలు చేయకుండా మహిళలను మోసం చేసిన టీడీపీని ఎడమచేయితో పోల్చారు. ఆదర్శనగర్ సచివాలయం పరిధిలో సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.24.96 కోట్లు ఖర్చుచేసి, 300 మందికి ఇళ్ల పట్టాలు అందించిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు కొనసాగడానికి 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా ఎన్నుకోవాలని కోరారు. అనంతరం వైఎస్సార్ సీపీ పతాకం ఎగురవేసి, సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో దాట్ల పెదబాబు, వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళా రాణి, డబ్బీరు ప్రశాంతి, చిల్ల భాస్కరరెడ్డి, ఎస్.కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, కొప్పల రమేష్, చిప్పాడ వెంకటేష్, బింగి హరికిరణ్‌రెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చిల్ల ప్రమీల, కంచుబోయిన వెంకటరావు, వంశీరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, చేట్ల నర్సింగ్, పందిరి విజయ్, దల్లి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రియల్ హీరో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

మధురవాడ: అన్ని వర్గాల ప్రజల అవసరాలు తెలుసుకుని, వారి ఆకాంక్షలు నెరవేర్చే రియల్ హీరో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం గురువారం మధ్యాహ్నం జీవీఎంసీ 5వ వార్డు బోయిపాలెం సమీపంలో గల జేఎన్ఎన్‌యూఆర్ఎం పీపీ – 2 కాలనీలో నిర్వహించారు. ముందుగా ఆయన సంక్షేమ పథకాల ఫ్లెక్సీలు, వైఎస్సార్ సీపీ పతాకం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ వ్యవస్థ కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే ఆశీర్వదించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, సచివాలయ కన్వీనర్లు అప్పలరెడ్డి, లక్ష్మి, ఉమాదేవి, బోర శ్రీనివాసరెడ్డి, బాబ్జి, రామారావు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు చిరునామా సీఎం జగన్

పీఎం పాలెం: దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ప్రజా సంక్షేమ పథకాలు అమలు పరచడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోల్ మోడల్‌గా నిలిచారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం 50వ నంబరు సచివాలయం ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. సిఫార్సులు, అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఒక్కసారి టీడీపీ పాలనతో సీఎం జగన్ సుపరిపాలనను బేరీజు వేసుకోవాలని కోరగా... ఇటువంటి సంక్షేమ పాలన ముందెన్నడూ చూడలేదని, మరలా ముఖ్యమంత్రిగా జగనే కావాలని స్థానికులంతా ముక్తకంఠంతో అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ముత్తంశెట్టి కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాదె రోశిరెడ్డి, బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, పోతిన సూరిబాబు, పిట్టా రామకృష్ణ, వెంకటేశ్వర రెడ్డి, జామి శివకుమార్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో విద్యాభ్యాసంపై సదస్సు

తగరపువలస: విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసంపై సంగివలస అనిట్స్‌లో గురువారం అవగాహన కల్పించారు. యూఎస్ఏలోని ఓల్డ్ డొమినియన్ విశ్వవిద్యాలయానికి చెందిన అజయ్ గుప్తా, రేఖా గుప్తా విద్యాభ్యాసంలో అవకాశాలతోపాటు విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీడీ రామారావు

మధురవాడ: నమ్మకం విజయానికి తొలిమెట్టు అని పలువురు వక్తలు అన్నారు. విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మధురవాడ కరెంటు ఆఫీసు వద్ద గల సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహంలో జిల్లాలోని పలు హాస్టళ్లకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల్లో భయం, ఒత్తిడిని జయించడంపై మోటివేషన్ క్యాంప్ గురువారం నిర్వహించారు. మధురవాడ, ఆనందపురం, భీమిలి, పెందుర్తి, గాజువాక, చిట్టివలస ప్రాంతాల్లోని వసతి గృహాలకు చెందిన 88 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ బి.శ్రీనివాసరావు, సోషల్ వెల్ఫేర్ గురుకుల జిల్లా కో ఆర్డినేటర్ రూపావతి, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుమల చైతన్య, సైకాలజిస్ట్ డాక్టర్ విజయభాస్కర్ తదితరులు మాట్లాడారు. భయం, ఆందోళన, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్ష రాస్తే శత శాతం విజయం సాధించడం కష్టం కాదన్నారు. ప్రణాళికతో చదువుకుని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే మరిన్ని విజయాలు సాధించవచ్చని చెప్పారు. ఏ సబ్జెక్టుకు ఎంత సమయం కేటాయించాలి, స్కోరింగ్ చేసే పద్ధతులు, కష్టమైన అంశాలు సులువుగా పరిష్కరించే టెక్నిక్స్ వివరించారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు డాక్టర్ టి.రాంబాబు, ఎస్.విక్టర్ పాల్, పి.శంకరరావు, లక్ష్మణరావు తదితరులు విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో యోగా టీచర్ సరోజిని, విశాఖ జిల్లా ఏఎస్‌డబ్ల్యూవో ఆర్.శ్యామల, భీమిలి ఏఎస్‌డబ్ల్యూవో జి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన బోడమెట్టపాలెం చిన్నారులు

తగరపువలస: ఇటీవల నగరంలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్, మేయర్ కప్ – 2023లో భీమిలి మండలం బోడమెట్టపాలెం చిన్నారులు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో అక్కరబోయిన యశ్విని, లొడగల నిరోషా, బొట్ట శశిధర్ బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. బొట్టా రోహిత్, దువ్వి భార్గవి బంగారు, రజత పతకాలు సాధించారు. వారాధి నవీన్, లొడగల భాస్కరరావు సిల్వర్ పతకాలు సాధించారు. వీరితోపాటు కోచ్ ఎ.శరత్‌బాబును సర్పంచ్ ముద్దాడ అప్పయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్‌బాబు, ముద్దాడ సూరప్పడు, రేగాని రాములమ్మ గురువారం అభినందించారు.